విస్తరణ.. ఇంతేనా?



కొత్తగూడెంలోని ప్రధాన అంతర్గత రహదారి దుస్థితి

అధ్వానంగా కొత్తగూడెం ప్రధాన రోడ్డు దుస్థితి

- ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభం
- విస్తరించినా రోడ్డు వేయని వైనం
- గుంతలు పడి నిలుస్తున్న నీళ్లు
- ప్రయాణమంటేనే జంకుతున్న జనం

ఖమ్మంఅర్బన్: నగరంలోని కొత్తగూడెం ప్రధాన రోడ్డుపై ప్రయాణం అంటేనే జనం జంకుతున్నారు. గ్రామంలోని ప్రధాన అంతర్గత రోడ్డులో ఓ వైపు 14వ డివిజన్, మరో వైపు 15వ డివిజన్ ఉండడంతో రెండు డివిజన్ల పరిధిలో అభివృద్ధికి నిధులు పుష్కలంగా వస్తాయని, రహదార్లు, డ్రెయిన్ల సమస్యలు తీరతాయని సంబరపడిన గ్రామస్తులకు తర్వాత కాలంలో నిరాశే మిగిలినట్లయింది. ఇద్దరు కార్పొరేటర్ల నడుమ గ్రామం అభివృద్ధి చెందుతుందనుకుంటే ఎవరి వారే వదిలేసినట్లుగా ఉందని గ్రామస్తులు మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో రోడ్డుపై గుంతలు పడి, నీరు నిలిచి రాకపోకలకు కష్టంగా మారింది.

అంతర్గతం అధ్వానం..

పేరుకే డ్రెయిన్లు, విస్తరణ పేరుతో కూల్చి వేతలు అంటూ గ్రామస్తులు మండిపడుతున్నారు. ప్రధాన అంతర్గత రోడ్డు పరిస్థితే ఇలా ఉంటే గ్రామంలోని అంతర్గత రోడ్ల పరిస్థితి ఏవిధంగా ఉందో ఇట్టే ఊహించుకోవచ్చు. నివాసాల్లో వాడుకున్న నీరు, వర్షం నీరు అంతా రోడ్లపైకి చేరుతుండడంతో పాటు మిషన్ భగీరథ పేరుతో తవ్వకాలు చేసి వదిలేశారు. ఇలా ఎక్కడ చూసినా ఏదో ఒక సమస్యతో అటు గ్రామస్తులు, ఇటు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి అభివృద్ధిలో వెనకబడిన తమ గ్రామాన్ని బాగు చేయాలని నివాసులు వేడుకుంటున్నారు.

గత ఏడాదిన్నర క్రితం రోడ్డు విస్తరణ, డ్రెయిన్లు, రోడ్డు నిర్మాణం అంటూ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా గ్రామంలో పలువురు నివాసాలు, ప్రహరీలు సైతం కోల్పోవాల్సి వచ్చినా అభివృద్ధి కోసం నివాసులు విస్తరణకు అంగీకరించారు. ఈనేపథ్యాన డ్రెయిన్ల నిర్మాణానికి కొంతమంది అంగీకరించపోవడంతో గ్రామస్తులే వారిని ఒప్పించారు. ఆతర్వాత రోడ్డు విస్తరణ చేసి

ఏడాదిన్నర క్రితం..

డ్రెయిన్లు నిర్మించాక రోడ్డు వేయకపోవడంతో గుంతలు పడి ప్రయాణ ప్రయాసలతో పాటు డ్రెయిన్‌లో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు.



కాల్వలో పేరుకుపోయిన మురుగు నీరు

దారుణంగా ఉంది..



రోడ్డు విస్తరణ పేరుతో కొత్తగూడెం.. చెత్తగూడెంగా మారింది. రోడ్డు వెడల్పు చేసి డ్రెయిన్ నిర్మించినా రోడ్డు వేయకపోవడంతో ప్రయాణం చేయలేక ఇబ్బంది పడుతున్నాం. సమస్య తీవ్రతను అనేక సార్లు కార్పొరేటర్లు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య మాత్రం తీరలేదు.

– సత్తి గోపాల్, కొత్తగూడెం

పట్టించుకోవడం లేదు..



మా గ్రామాన్ని రెండు డివిజన్ల పరిధిలో ఉంచడంతో తాము ఎవరికీ కానరావడం లేదు. ఇద్దరు కార్పొరేటర్లు పట్టించుకోకపోవడంతో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధాన అంతర్గత రహదారి విస్తరణ పేరుతో నివాసాలు కూల్చి డ్రెయిన్ కట్టి, రోడ్డు వేయకుండానే వదిలేశారు.

– ఎర్రబోయిన గోవింద్, కొత్తగూడెం

పేరుకే నగరంలో ఉన్నాం..



పేరుకే నగరంలో ఉన్నాం. తమ గ్రామానికి ఆనుకోని నాలుగు లైన్ల రోడ్డు ఉన్నా.. గ్రామంలో సరైన రోడ్డే లేదు. రోడ్డు విస్తరణ చేసినా రోడ్డు వేయకుండానే వదిలేశారు. గ్రామంలో అంతర్గత రహదార్లు నిర్మాణం సక్రమంగా నోచుకోలేదు. గ్రామంలో అభివృద్ధిని చూస్తుంటే బాధ కల్గుతుంది.

– ఎస్‌కె.సుల్తాన్, కొత్తగూడెం

‘ఇందిరమ్మ’ సర్వే త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. శనివారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్వేకు వెళ్లే సమయంలో సంబంధిత వ్యక్తులకు సమాచారం అందించాకే ఇళ్లకు వెళ్లాలని, అప్పుడే సమాచార సేకరణ త్వరగా జరుగుతుందని చెప్పారు. సర్వేలో కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని, ఆ ఇల్లు ఎవరి పేరు మీద ఉందనే సమాచారం తెలుసుకునేందుకు డాక్యుమెంట్లు పరిశీలించాలన్నారు. తప్పులు లేకుండా సమాచారం సేకరించి ప్రతీ ఇంటి దగ్గర వారి ఫొటో, ఇంటి ఫొటో అప్‌లోడ్ చేయాలని సూచించారు. కొత్తగా వచ్చిన వార్డు ఆఫీసర్లకు సర్వే ఎలా చేయాలో వివరించారు.

కమిషనర్‌తో ఎంపీ భేటీ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన చర్యలపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో శనివారం ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించాల్సిన పనులు, వాటికి అవసరమైన నిధుల వివరాలను కమిషనర్ ఎంపీకి వివరించారు. రైల్వే మూడో లైన్ నిర్మాణం సందర్భంగా ట్రాక్‌ల కింద డ్రెయినేజీల నిర్మాణ పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. తొలుత ఎంపీకి కమిషనర్ పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు.

రాజకీయాలకు అతీతంగా ఇళ్లు ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: నియోజకవర్గ పరిధిలో రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులందరికీ ఇంటి స్థలాలు, ఇల్లు కట్టుకోవడానికి ఒకేసారి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే, మంజూరు పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ సీపీఎం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన శనివారం కేఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ.. ప్రజాపాలనలో వచ్చిన కొన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేయకపోవడంతో వారిని సర్వే చేయడం లేదని, మరోమారు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చి సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా రేషన్ కార్డులు లేక ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, వెంటనే రేషన్ కార్డులు ఇచ్చేలా చూడాలన్నారు. నగరంలో పలుచోట్ల కొంతమంది నాయకులు రాజకీయ జోక్యం చేస్తున్నారని అలా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఏ.జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, దొంగల తిరుపతిరావు, షేక్.మీరాసాహెబ్, కార్పొరేటర్ ఎల్లంపల్లి వెంకట్రావు, నాయకులు భుక్యా శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, షేక్.నాగులు మీరా, బత్తిని ఉపేందర్, వజినేపల్లి శ్రీనివాసురావు, నర్రా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంరూరల్/రఘునాథపాలెం/నేలకొండపల్లి: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పలువురు నాయకులు కోరారు. ఖమ్మంరూరల్, రఘునాథపాలెం, నేలకొండపల్లి మండలాల్లో దీక్ష చేపట్టిన పంచాయతీ కార్మికులకు మద్దతు పలికి మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పి.మోహన్‌రావు, ఏర్పుల శ్రీనివాసరావు, వెంకన్న, మల్లయ్య, అనురాధ, తోట రామాంజనేయులు, ఎస్.నవీన్‌రెడ్డి, జి.రామయ్య, మందా వెంకటేశ్వర్లు, పిట్టల మల్లయ్య, కె.శ్రీనివాస్, జి.రాందాస్, నెహ్రూ, భద్రు, సంపత్, వెంకటేశ్, విజయలక్ష్మి, ఉపేందర్, మంగీలాల్, రాజగోపాల్, రాము, ఉపేందర్, ప్రవీణ్, రహిముతుల్లా, వంగూరి నాగరాజు, వాచేపల్లి అనిత, వెంకటేశ్వర్లు, బొడ్డు ఆంజనేయులు, కస్తాల గోపయ్య, పగిడికత్తుల రామదాసు పాల్గొన్నారు.



శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన



ఖమ్మంసహకారనగర్: నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంమామిళ్లగూడెం: కేజీబీవీ విద్యాలయాలు, మండల విద్యాశాఖలో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సంఘం బాధ్యులు ఝాన్సీ సౌజన్య, వీరస్వామి, తెలంగాణ జనసమితి (టీజేఎస్) ఖమ్మం జిల్లా కన్వీనర్ వి.బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే చర్చలకు పిలిపించి తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప దినాల సందర్భంగా తెల్ల టోపీలు ధరించి మౌన ప్రదర్శన నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్, నిర్మల, కృష్ణప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, సాంబశివరావు, టీజేఎస్ నాయకులు నరసింహారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక

నేలకొండపల్లి: పంచాయతీ అభివృద్ధి పనులకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ, పంచాయతీ ప్రత్యేకాధికారి ఎం.యర్రయ్య పేర్కొన్నారు. శనివారం నేలకొండపల్లి మేజర్ పంచాయతీలో నిర్వహించిన జీపీడీపీ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. తొలుత సభలో గత బడ్జెట్ పనుల వివరాలను చదివి వినిపించారు. కాగా, గ్రామస్తులు, మాజీ ప్రజాప్రతినిధులు వివిధ పనులను సభా దృష్టికి తీసుకెళ్లగా.. వాటిని పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించి అత్యవసర పనులను గుర్తించారు. ఈ సభలో మాజీ సర్పంచ్ వెంకన్న, మాజీ ఎంపీటీసీ బొందయ్య, కాసాని నాగేశ్వరరావు, కడియాల నరేష్, వంగవీటి రవి, నకిరికంటి సూర్యనారాయణ, గ్రామ దీపికలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ యర్రయ్య

వ్యవసాయ కార్మికులందరికీ రూ.12వేలు ఇవ్వాలి



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు

ఖమ్మంమామిళ్లగూడెం: ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ రూ.12వేలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం చేసింది. శనివారం నగరంలోని మంచికంటి మీటింగ్ హాలులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీకి సంబంధం లేకుండా వ్యవసాయ కార్మికులందరికీ రూ.12వేలు ఇవ్వాలని, లబ్ధిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని కోరారు. ఈ నెల 30న కలెక్టర్లకు, జనవరి 6న తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు మెరుగు సత్యనారాయణ, తాటి వెంకటేశ్వర్లు, పగిడిపల్లి ఏసు, మెరుగు రమణ, బండి పద్మ, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, శ్రీనివాసరావు, శివలింగం, బందెల వెంకయ్య, టిహనుమంతరావు, తుడుం ప్రవీణ్, వినయ్, పగడాల నాగేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావు, జాజిరి శ్రీనివాసరావు, పి.సంగయ్య, టి.కృష్ణార్జునరావు, వడ్లమూడి నాగేశ్వరరావు, కేవీ రెడ్డి, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, బంధం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

రామదాసు మందిరం సందర్శన

నేలకొండపల్లి: పరమ భక్త గ్రేసరుడు కంచర్ల గోపన్న(భక్తరామదాసు)ను చెన్నైలోని కంచి కామకోటి అస్థాన సంగీత విద్యాంసుడు ఎస్.వరప్రసాద్ శనివారం సందర్శించారు. తొలుత మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మందిరంలో కచేరీ నిర్వహించారు. ఆయన వెంట మందిరం అర్చకులు సౌమిత్రి రమేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన నాణ్యతలో రాజీపడొద్దు



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ సిలార్‌సాహెబ్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా భోజన నాణ్యతను పరిశీలించాక భోజనం చేశారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించడంలో రాజీపడొద్దని ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన వర్కర్లకు సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేనూ పరిశీలించారు.

పంటల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి గ్రామంలో కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు సరిత పంటలను శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో సోకే వివిధ తెగుళ్లపై రైతులకు సూచనలు, సలహాలు అందించారు. విచక్షణారహితంగా పురుగుల మందులు వాడొద్దని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణాధికారి శిరేఖ, రైతు ప్రతినిధులు కనకబండి కనక రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ..

- ఇద్దరికి తీవ్రగాయాలు

ఖమ్మంరూరల్: మండలంలోని మద్దులపల్లి శివారులోని కోతులగుట్ట వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కథనం ప్రకారం.. తెల్దారుపల్లికి చెందిన బర్మావత్ సందీప్, భూక్యా అజయ్ శుక్రవారం రాత్రి తెల్దారుపల్లి నుంచి ఖమ్మం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో కోతులగుట్ట వద్దకు రాగానే వీరు ముందు వెళ్తున్న మరో ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టగా.. సందీప్, అజయ్‌లకు తీవ్ర గాయపడ్డారు. దీంతో వీరిని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సందీప్ తండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

అంబేడ్కర్‌ను అవమానించడం సరికాదు

ఖమ్మంరూరల్: ప్రపంచ దేశాల కంటే గొప్ప రాజ్యాంగాన్ని భారత దేశానికి అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా అవమానించడం సరికాదని కేవీపీఎస్ రాష్ట్ర నాయకుడు పి.సత్యనారాయణ అన్నారు. శనివారం ఈమేరకు కేవీపీఎస్ ఆధ్వర్యాన మండలంలోని ఎంవెంకటాయపాలెంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.మధు, పి.అన్నపూర్ణ, ఆర్.రమేష్, రాంబాయి, ఉప్పలి తదితరులు పాల్గొన్నారు.

వాణి ఐటీఐ కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వాణి ఐటీఐ కళాశాలలో శనివారం విజన్ జియో ఇన్ఫ్రామ్యాటిక్స్, థర్మోకేబుల్స్ కంపెనీలో ప్లేస్‌మెంట్స్ నిర్వహించినట్లు దరిపల్లి విద్యాసంస్థల అధినేత డాక్టర్ దరిపల్లి కిరణ్, ప్రిన్సిపాల్ స్వాతిలు తెలిపారు. టెక్నీషియన్ పోస్టు కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రతిభ చాటిన విద్యార్థులను హైదరాబాద్‌లో జనవరి 3 నుంచి 5 వరకు నిర్వహించే ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ డైరెక్టర్ శ్రీమన్నారాయణ, టెక్నికల్ స్టాఫ్ లక్ష్మణ్, యుగేంధర్, అస్మత్, సువర్చల తదితరులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం కోసమే రాజ్యాధికార బాట

ఖమ్మం మామిళ్లగూడెం: ఆత్మగౌరవం కోసమే బీసీలు రాజ్యాధికార బాట పట్టారని పలువురు బీసీ సంఘ నాయకులు అన్నారు. శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో సోషల్ జస్టిస్ జేఏసీ చైర్మన్ వీజీఆర్ నారగోని మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాలు, బీసీలు రాజ్యాధికారం కోసం పోరాడకపోవడంతోనే అగ్రవర్ణాల అజమాయిషీ కొనసాగుతుందన్నారు. ఇక నుంచి ఏ వర్గం వారు ఆ వర్గానికి సంబంధించినవి అనుభవించేలా సామాజిక న్యాయాన్ని సాధిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా నాయకురాలు సరస్వతి, కొండా పద్మ, విజయశాంతి, సుంకరి శ్రీనివాస్, కత్తి విజయ్ గౌడ్, వెంకట స్వామి, బండి నాగేశ్వరరావు గౌడ్, ఖమ్మం ఇన్‌చార్జ్ పొడగంటి రాంబాబుచారి, జనసభ రాష్ట్ర సెక్రటరీ, జూలూరి రమేష్ గౌడ్, కొడుపు గంటి శ్రీధర్, పల్లెపు సోమరాజు, పెరుగు రమణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్లు ఆవిష్కరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య శనివారం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని గ్రామ స్థాయి నుంచి ఆందోళనలు చేపట్టాలని సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అన్ని గ్రామాలకు క్యాలెండర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, నేలకొండపల్లి సొసైటీ చైర్మన్ కోటి సైదారెడ్డి, నాయకులు శీలం వెంకటలక్ష్మి, పాకనాటి గోపిరెడ్డి, మరికంటి రేణుబాబు, గొలుసు రవి, మాదాసు ఆదాం, కమదన ప్రవీణ్, ఉస్సేన్, కనక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత, హస్తకళా ప్రదర్శనకు ఆదరణ



వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని టీటీడీ కల్యాణమండపంలో కళాసిల్క్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శన, అమ్మకానికి ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందనినిర్వాహకుడు వినోద్ తెలిపారు. అద్భుత అల్లికలతో తయారైన సిల్క్, కాటన్ వస్త్రాలు తమ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశామన్నారు. అంతేకాక మూగా అండ్ ఎరిశిల్క్, బాగల్పూర శిల్క్స్, టస్సర్, ట్రిబిల్ వర్క్ కోసా శిల్క్, బాందని, కచ్చ ఎంబ్రాయిడరీ డ్రెస్, శారీస్, బెడ్‌కవర్లు, కుషన్ కవర్లు, డ్రెస్ మెటీరియల్ ఉన్నట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని చెప్పారు.

ఎస్సెస్సీ విద్యార్థులకు అల్పాహారం

తిరుమలాయపాలెం: మండలంలోని తిరుమలాయపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు జీవశాస్త్ర ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్‌రెడ్డి శనివారం అల్పాహారం అందించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న నేపథ్యాన అల్పాహారాన్ని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్యాంక్ కాలనీలోని ఓ వీధి



బస్ డిపో రోడ్డు.

వెలగని వీధిలైట్లు

నగరంలోని బస్ డిపో రోడ్డు, బ్యాంక్ కాలనీలోని పలు వీధులు, తదితర ప్రాంతాల్లో శనివారం వీధి లైట్లు వెలగలేదు. దీంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడగా.. దొంగల భయం నెలకొంది. – ఖమ్మంమయూరిసెంటర్

క్లుప్తంగా

హెచ్‌ఎంపై దాడి గర్హనీయం

ఖమ్మం సహకారనగర్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు రాములుపై మతోన్మాద మూకలు భక్తి ముసుగు వేసుకుని ఉద్దేశపూర్వకంగా చేసిన దాడిని ఖండిస్తున్నామని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. దాడి విషయాన్ని ప్రభుత్వం, పోలీసులు సీరియస్‌గా తీసుకుని నిందితులపై కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

శాశ్వత రహదారి నిర్మాణం చేపట్టాలి

కామేపల్లి: ఖమ్మం–ఇల్లెందు ప్రధాన రహదారి మద్దిగూడెం స్టేజీలో గుంతలమయమైన ఆర్ అండ్‌బీ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్పీ రాకేష్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకుంటే తమ పార్టీ ఆధ్వర్యాన ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆర్ అండ్‌బీ అధికారులను హెచ్చరించారు.

చదరంగం పోటీల్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న డైరెక్టర్ రవీందర్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థి సాత్విక్ సాయి రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో నాల్గవ స్థానంలో నిలిచాడని పాఠశాల డైరెక్టర్ కడారి రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నిదిరాజ్ గుప్తాలు తెలిపారు. శనివారం పాఠశాలలో విద్యార్థిని అభినందించిన సందర్భంగా వారు మాట్లాడారు. మహబూబాబాద్‌లో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడన్నారు.

‘డేర్’లో అవగాహన సదస్సు

ఖమ్మంరూరల్: మండలంలోని కొత్తూరులో గల డేర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఫైనాన్షియల్ లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దరిపల్లి కిరణ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సేవింగ్ ప్లాన్, రికరింగ్ డిపాజిట్, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీస్, సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. అకడమిక్ ఇన్‌చార్జ్ డాక్టర్ శిరీష, కరస్పాండెంట్ స్వాతి, ఎన్సీసీ కోఆర్డినేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: పీడీఎస్‌యూ నగర కమిటీని శనివారం నగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యశ్వంత్, ఉపాధ్యక్షులుగా నసీర్, ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా చంద్రశేఖర్, వెంకటేష్ కోశాధికారి ప్రణయ్‌తో పాటు మరో 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ..ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత విస్తరణ కోసం, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామన్నారు. ప్రైవేట్ విద్యాలయాల్లో ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు.

బ్యాగుల పంపిణీ

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు చేతన ఫౌండేషన్ ఆధ్వర్యాన శనివారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సీఎంఓ రాజశేఖర్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు బ్యాగులు అందించడం అభినందనీయమన్నారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యాన కష్టపడి చదవాలని, ఉపాధ్యాయులు కూడా అదనపు తరగతులు తీసుకుని పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. సంస్థ సభ్యులు ముత్తినేని సురేష్, చంద్రకాని నవీన్, రామయ్య, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీరువా వితరణ



బీరువా అందజేస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం రమణగుట్ట ప్రాంతంలోని రహమత్‌నగర్‌కు చెందిన నిరుపేద యువతి వివాహానికి ప్రముఖ పిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్, అవామే ఏ హింద్ వెల్ఫేర్ అండ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ హాఫీజ్ మహమ్మద్ జవ్వాద్ అహ్మద్ చేతుల మీదుగా యువతి కుటుంబీకులకు బీరువా వితరణ చేశారు. మానవత్వంతో నిరుపేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ఈ వితరణ చేసినట్లు దాతలు పేర్కొన్నారు.